చేవెళ్ల గడ్డ.. కాసానిదే..

బడుగులమంతా ఏకమై గెలిపించుకుంటామని స్పష్టీకరణ

జాగ్రత్తగా లేకుంటే రాజకీయ నాయకులు చిన్నచూపు చూస్తారని హెచ్చరిస్తున్న బీసీ సంఘాల నేతలు

రాజ్యాధికారం కోసం బడుగులమంతా ఏకమవ్వాల్సిన సమయం వచ్చిందని బీసీ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. బీసీల పక్షాన ప్రశ్నించే గొంతుకగా ముందుండి పోరాటం చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని స్పష్టం చేస్తున్నారు. బడుగులు బలపడొద్దని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలను ఈ ఎన్నికల్లోనే తిప్పి కొడదామని పిలుపునిస్తున్నారు. వాస్తవాలను గ్రహించి ముందుకు సాగితే రాజ్యాధికారం తప్పకుండా సాధ్యమేనని చెబుతున్నారు. బీసీ బిడ్డను గెలిపించుకోకపోతే రాజకీయ పార్టీలు బీసీలను చిన్నచూపు చూస్తాయని హెచ్చరిస్తున్నారు. అలాంటి పరిస్థితి రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని.. బీసీలను ఓటు బ్యాంకుగా చూసే నాయకులకు ఈ ఎన్నికల్లో వేసే ప్రతి ఓటూ చెంప పెట్టులా ఉండాలని సూచిస్తున్నారు. చేవెళ్ల గడ్డపై 'కాసాని'దే జయకేతనమని, బడుగులమంతా ఏకమై గెలిపించుకుని తీరుతామని ప్రతిన బూనుతున్నారు.

- రంగారెడ్డి, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ)

కాసానికి బీసీల మద్దతు ఉంటుంది..

-శంకర్ యాదవ్, రామన్నగూడ మాజీ సర్పంచ్ ,చేవెళ్లటౌన్

బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు సముచిత ప్రాధాన్య మిచ్చింది. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు కేసీఆర్ టికెట్ కేటాయించడంతో ఆయన్ను గెలిపించుకోవాల్సిన బాధ్యత బీసీలందరిపైనా ఉన్నది. కాసానిని గెలిపించి.. బీఆర్ఎస్ అధినేతకు బహుమతిగా ఇద్దాం.

ఎగిరేది గులాబీ జెండానే..

- శ్రీనివాస్, నారాయణదాస్‌గూడ, చేవెళ్లటౌన్

చేవెళ్ల గడ్డపై ఈ పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురడం ఖాయం. కాసాని జ్ఞానేశ్వర్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తారు. బీసీల కోసం గతంలో ఆయన అనేక ఉద్యమాలు చేశారు. బీసీలందరూ తమ ఓటును కారు గుర్తుకు వేసి కాసానికి మద్దతుగా నిలవాలి.

పార్టీలకతీతంగా ఏకం కావాలి

-రాజగోపాలచారి, మాజీ ఎంపీపీ దోమ

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో బీసీలే ఉన్నారు. అందుకే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీసీ బిడ్డకు పోటీ చేసే అవకాశం ఇచ్చారు. అందువల్ల బీసీలందరూ పార్టీలకతీతంగా ఏకమై కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి. బీసీల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడుతున్న వారికి సరైన బుద్ధి చెప్పాలి. కాసానిని గెలిపించి బీసీల ఐక్యతను చాటాలి.

బీసీల సత్తా చాటాలి

-నల్ల రామ్‌నాథ్, వికారాబాద్ జిల్లా బీసీ విద్యార్థి విభాగం జనరల్ సెక్రటరీ, అయినాపూర్, దోమ

బీసీ యువత ఏ పార్టీలో ఉన్నా బీసీల ముద్దు బిడ్డ జ్ఞానేశ్వర్ గెలుపునకు కృషి చేయాలి. కాసాని జ్ఞానేశ్వర్ 96 బీసీ కులాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారు. అలాంటి వ్యక్తికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశాన్ని కల్పించారు. అందువల్ల పార్టీలకతీతంగా బీసీ యువత, ఓటర్లు ఏకమై ఈ ఎన్నికల్లో కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకుని.. మన సత్తాను చాటాలి.

కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టాలి

-బీ.రాజు ముదిరాజ్, బీసీ నాయకుడు, కొత్తగూడ

బీసీలను విస్మరించే పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలంటే ఈ ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌ను చేవెళ్ల నుంచి భారీ మెజార్టీతో గెలిపించాలి. ఆయన బీసీల పక్షాన ప్రశ్నించే గొంతుకగా ముందుండి పోరాటం చేస్తున్నారు. బడుగులు బలపడొద్దని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలను ఈ ఎన్నికల్లోనే తిప్పి కొట్టాలి.

లోక్‌సభలో బీసీల వాణి వినిపిస్తుంది..

-చింతల నవీన్‌కుమార్, ఐటీ ఉద్యోగి, కొత్తగూడ

నిస్వార్థంగా బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌ను ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి బీసీపైనా ఉన్నది. ఆయన పార్లమెంట్‌కు వెళ్తే బీసీల సమస్యలు పరిష్కరమవుతాయి. మన వాణి లోక్‌సభలో వినిపిస్తుంది. ఓటు బ్యాంకుగా వాడుకునే రాజకీయ పార్టీల మాటలను నమ్మి మోసపోకుండా బీసీలు ఐక్యతతో ముందుకెళ్లాలి.

బీసీలు మౌనం వీడాలి

-ప్రదీప్‌కుమార్, లింగాయత్ సంఘం నాయకుడు, బడంగ్‌పేట

బీసీలు మౌనం వీడాలి. బీసీలకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో ఉన్న కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాలి. మౌనంగా ఉండడంతోనే అధికారానికి దూరంగా ఉంటున్నాం. కాసాని గెలుపునకు బీసీల్లో ఉన్న అన్ని కులాలను ఏకం చేద్దాం. ఇంతకాలం వివిధ వర్గాల వారికి మద్దతు ఇచ్చాం.

బీసీల ప్రాధాన్యత పెరుగుతుంది..

నాగరాజు, బీసీ సంఘం నాయకుడు, బడంగ్‌పేట

కాంగ్రెస్, బీజేపీలు బీసీలకు అన్యాయం చేస్తున్నాయి. బీఆర్ఎస్‌తోనే బీసీలకు న్యాయం జరుగుతుంది. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల్లో బీసీ అభ్యర్థి అయిన కాసానిని గెలిపించుకుంటే రానున్న రోజుల్లో బీసీల ప్రాధాన్యత రాజకీయాల్లో మరింత పెరుగుతుంది. అన్ని పార్టీలు బీసీలకు సీట్లు ఇచ్చేందుకు ముందుకొస్తాయి. కాసాని గెలుపుతో బీసీల్లో చైతన్యం వస్తుంది.

కాసాని విజయం.. బీసీల గెలుపు

-గోపాల్ ముదిరాజ్, మండల ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి, యాలాల

బీసీల గొంతుకను గత ప్రభుత్వాలు అణచివేశాయి. ఇప్పుడు మన గళం వినిపించాల్సిన సమయం వచ్చింది. అగ్రవర్ణ నాయకుల అహంకారపూరిత మాటలకు ఓటు ద్వారా సమాధానం చెప్పాలి. కొన్నేండ్లుగా బీసీలు రాజకీయంగా వెనుకబడిపోయారు. కాసాని గెలుపుతో బీసీల గొంతుక లోక్‌సభలో వినిపిస్తుంది. ఓటు మన చేతిలో ఉన్నది.. విజయం మన ముంగిట ఉన్నది. ఈ అవకాశాన్ని బీసీ బిడ్డలు చేజార్చుకోవద్దు.

బీసీలు ఏకం కావాలి..

-చాకలి వెంకటేశ్, హాజీపూర్, యాలాల



కాంగ్రెస్ నాయకుల మాటలు బీసీలను అవమానపర్చేలా.. ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి. ఇప్పుడు బీసీల ఐక్యత చూపించాల్సిన సమయం ఆసన్నమైనది. రాజకీయంగా బీసీలను అగ్రవర్ణ నాయకులు ఎదుగనివ్వడంలేదు. బీసీలందరూ పార్టీలకతీతంగా ఏకమై చేవెళ్లలో కాసానిని గెలిపించి మన సత్తాను చాటాలి.

జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుంటాం..

-రవి, పట్లూర్, మర్పల్లి



బీసీలందరం ఏకమై కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన కాసానికి బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల ఎంపీ టికెట్ ఇవ్వడం సంతోషకరం. బీసీలను చిన్నచూపు చూస్తున్న పార్టీలకు కనువిప్పుకలిగేలా ఈ ఎన్నికల్లో కాసానిని గెలిపించుకుంటాం. బీసీలు ఐక్యంగా ఉంటే ఎలా ఉంటుందో అందరికీ అర్థమయ్యేలా చేస్తాం.

బీసీలను ఏకం చేసిన నాయకుడు కాసాని

- గోవర్ధన్, వికారాబాద్

రాష్ట్రంలో 96 కులాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి వారి సమస్యలపై పోరాటం చేసిన ఘనత కాసాని జ్ఞానేశ్వర్‌కే దక్కుతుంది. అలాంటి నాయకుడిని గుర్తించిన కేసీఆర్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించడం గొప్ప పరిణామం. బీసీల సమస్యలు పరిష్కారం కావాలంటే కాసాని ఎంపీగా గెలవాల్సిందే. మన సత్తా చాటాల్సిందే.

పార్లమెంట్‌లో చర్చించేవారు కావాలి

-రాజు, శాస్త్రీపురం, రాజేంద్రనగర్

పార్లమెంట్‌లో తెలంగాణ సమస్యలపై చర్చించేవారు కావాలి. అందుకు బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ బలపర్చిన కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపిస్తేనే అది సాధ్యమవుతుంది. కాంగ్రెస్, బీజేపీల ఎంపీ అభ్యర్థులు ఎప్పుడూ రాష్ట్ర సమస్యలపై మాట్లాడడంలేదు. రాష్ట్రాభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం. పదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందింది.

జాతీయ పార్టీలు ప్రజలను పట్టించుకోవు..

-వెంకటరమణ, సులేమాన్‌నగర్ డివిజన్, రాజేంద్రనగర్

జాతీయ పార్టీలు మన సమస్యలను పట్టించుకోవు. ఎన్ని కలప్పుడే ప్రజల మధ్య హడావుడి చేసి.. ఆ తర్వాత కనిపించవు. కానీ.. బీఆర్ఎస్ పార్టీ అలా కాదు.. తెలంగాణ అభివృద్ధే ధ్యేయంగా ఆ పార్టీ ఏర్పడింది. కాసాని జ్ఞానేశ్వర్‌ను బీసీలందరూ గెలిపించుకోవాలి. పార్లమెంట్‌లో బీసీల వాయిస్ వినబడాలంటే..బీసీ నాయకుడిని ఎంపీగా గెలిపించుకోవాలి.

మహేశ్వరంలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల ప్రచారానికి ప్రజా స్పందన కరువు

- చేవెళ్ల ఎంపీ అభ్యర్థులు గతంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన వారే!
- పూటకో పార్టీ మారే వారికి ఓట్లు ఎందుకు వేయాలని ప్రశ్న?
- ఇద్దరినీ దూరం పెడుతున్న నియోజకవర్గ ప్రజలు
- బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపుతున్న ఓటర్లు

బడంగ్‌పేట, ఏప్రిల్ 25 : మహేశ్వరం నియోజకవర్గ వ్యాప్తంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారం చేయాలనుకుంటున్నా ఓటర్ల నుంచి స్పందన లేకపోవడంతో ఆయా పార్టీల అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల అభ్యర్థులు రంజిత్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గతంలో బీఆర్ఎస్ పార్టీలో పనిచేసిన వారే కావడంతో ఓటర్లు పెదవి విరుస్తున్నారు. ఇద్దరూ చేవెళ్ల పార్లమెంటు స్థానం నుంచి బీఆర్ఎస్ ఎంపీలుగా ఎన్నికైన వారే కావడంతో వారిపై ప్రజలకు అభిమానం లేదన్న చర్చ జరుగుతున్నది. వారికి ఓట్లు వేస్తే మళ్లీ పార్టీ మారకుండా ఉంటారన్న గ్యారెంటీ ఏముందన్న ఆలోచన చేస్తున్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టినా పెద్దగా ఎవరూ పట్టించుకోవడం లేదు. దాంతో ఇతర పార్టీల నేతలకు గాలం వేసే పనిలో ఉన్నారని పలువురు చర్చించుకుంటున్నారు. ఆ రెండు పార్టీల అభ్యర్థుల వ్యవహారంపై అనేక అనుమానాలున్నాయని నియోజకవర్గ వ్యాప్తంగా చర్చ జరుగుతున్నది.

స్థానిక నాయకుల్లో కానరాని సమన్వయం

దీనికితోడు కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో కొత్త పాత నాయకుల మధ్య సమన్వయయం లేకుండాపోయింది. ఎన్నికల ప్రచారంలో ఆ విషయం కొట్టొచ్చినట్లు కన్పిస్తున్నది. నాయకులను సమన్వయం చేయలేక అభ్యర్థులు తల పట్టుకుంటున్నారు. ఓటర్లకు హామీలు గుప్పించి ఓట్లు దండు కోవాలని చూస్తున్నారు. ఒకరు దేవుడి పేరుతో ఓట్లు అడుగుతుంటే.. మరో పార్టీ అలవికాని హామీలిచ్చి ఓట్లు వేయించుకోవాలని చూస్తున్నది. అయినప్పటికీ ఆయా పార్టీల అభ్యర్థుల ప్రచారానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. గ్రామాల్లో కరెంటు, తాగునీటి సమస్యలు జఠిలంగా మారడంతో కాంగ్రెస్ నాయకుల నాలుక మడత పడిపోతున్నది. ఇచ్చిన హామీల గురించి అడిగితే దాటవేస్తున్నారు. కొంత మంది నాయకులు ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రచారం మధ్య నుంచే వెళ్లిపోతున్నట్లు సమాచారం. మహేశ్వరం నియోజకవర్గ వ్యాప్తంగా ఇదే తంతు కొనసాగుతున్నది. దీంతో మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్ పార్టీ వైపు మొగ్గుచూపే అవకాశం కన్పిస్తున్నది.

పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- నేటి నుంచి ఓటరు స్లిప్‌ల పంపిణీ
- మహేశ్వరంలో 537 పోలింగ్ కేంద్రాలు
- ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి సూరజ్‌కుమార్

మాట్లాడుతున్న ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ సూరజ్‌కుమార్

కందుకూరు. ఏప్రిల్ 25 : మహేశ్వరం నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ సూరజ్‌కుమార్ తెలిపారు. ఓటర్లకు నేటి నుంచి స్లిప్‌లను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి మాట్లాడారు. నియోజకవర్గంలో మొత్తం 5,56,741 ఓటర్లుండగా 537 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులను కల్పిస్తున్నట్లు చెప్పారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి 5 రోజుల్లో స్లిప్‌ల పంపిణీని పూర్తి చేయాలని ఆదేశించారు.

బడంగ్‌పేట్, సరూర్‌నగర్, ఆర్కేపురం, నాదర్‌గుల్, గాయిత్రినగర్‌లలో 9 పోలింగ్ కేంద్రాలను మార్చినట్లు తెలిపారు. ఈ విషయాన్ని అన్ని పార్టీల నాయకులకు వివరించినట్లు పేర్కొన్నారు. తుక్కుగూడ. నాగారం, బాలాపూర్‌లలో చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, ఆధారాలు లేకుండా నగదును తరలించవద్దని సూచించారు.

ఇప్పటివరకు కోటి 13లక్షల విలువైన డ్రగ్స్, రూ. 5.37వేల నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. రూ. 4.37లక్షల విలువైన మద్యం పట్టుకున్నట్లు చెప్పారు. రాజకీయ నాయకుల బహిరంగ సభలపై దృష్టిపెట్టి రికార్డు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించాలని నాయకులు, ప్రజలను కోరారు. సమావేశంలో ఎన్నికల నాయబ్ తాసీల్దార్ శేఖర్, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనసూయ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు

మధుయాష్కీ కుటుంబానికి సీఎం పరామర్శ

హయత్‌నగర్, ఏప్రిల్ 25 : టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యుడు మధుయాష్కీగౌడ్ కుటుంబ సభ్యులను గురువారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వారి నివాసంలో పరామర్శించారు. మధుయాష్కీగౌడ్ తల్లి అనసూయ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. అనసూయ దశదిన కర్మ సందర్భంగా హయత్‌నగర్‌లోని మధుయాష్కీగౌడ్ నివాసానికి సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర ప్రముఖులు విచ్చేసి కుటుంబసభ్యులను పరామర్శించారు. అంతకుముందు అనసూయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఎంతోపాటు మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల మాటలను నమ్మొద్దు..

దెబ్బడగూడలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

కందుకూరు. ఏప్రిల్ 25 : కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలను నమ్మి మోసపోవద్దని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ప్రజలకు సూచించారు. బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా గురువారం మండలంలోని దెబ్బడగూడలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలను నమ్మి ప్రజలు మరోసారి మోసపోవద్దన్నారు. కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం తప్పకుండా అధికారంలోకి వస్తుందన్నారు. అమలు సాధ్యం కాని హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ మంద జ్యోతిపాండు, మండల ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి, ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, చెన్నారెడ్డి, దయాకర్‌రెడ్డి, భీమ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ తరపున మరో నామినేషన్

- మాధవీలతకు ప్రత్యామ్నాయంగా సుభాష్ చందర్‌జీ నామినేషన్ దాఖలు



ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సుభాష్ చందర్‌జీ

సైదాబాద్, ఏప్రిల్ 25 : బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలతకు ప్రత్యామ్నాయ రెండో అభ్యర్థిగా సైదాబాద్‌కు చెందిన నగర మాజీ డిప్యూటీ మేయర్, బీజేపీ సీనియర్ నాయకుడు జి.సుభాష్ చందర్‌జీ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ అధిష్టానం అదేశాల మేరకు సుభాష్ చందర్‌జీ హైదరాబాద్ కలెక్టరేట్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి తన నామినేషన్ పత్రాలను బీజేపీ నాయకులు కడారి రాంకుమార్, కోళ్లగోపి, అభిషేక్‌గౌడ్‌తో కలిసి అందజేశారు.

ప్రోత్సాహకాలతో విద్యార్థుల్లో పఠనాసక్తి

గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో విద్యార్థులతో కేంబ్రిడ్జ్ పాఠశాల ప్రిన్సిపాల్ కె. ఝాన్సీ

సైదాబాద్, ఏప్రిల్ 25 : సైదాబాద్ కరణ్‌బాగ్ కాలనీలోని కేంబ్రిడ్జ్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రీ ప్రైమరీ పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా సంవత్సరంలో ప్రతిభ చూపిన ప్రీ ప్రైమరీ, ఉన్నత తరగతుల విద్యార్థులకు వార్షిక బహుమతులను అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె. ఝాన్సీ మాట్లాడుతూ విద్యార్థులకు పురస్కారాలు అందించి ప్రోత్సహించడం ద్వారా వారిలో చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. కిండర్ గార్డెన్ పూర్తి చేసుకున్న చిన్నారులు సంప్రదాయ స్నాతకోత్సవ దుస్తులు, టోపీలు ధరించి సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కె. శతన్‌కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీకి బుద్ధి చెప్పాలి

సరూర్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న అనితాదయాకర్‌రెడ్డి, బాలకిషన్

ఆర్కేపురం, ఏప్రిల్ 25 : కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ సరూర్‌నగర్ కార్పొరేటర్ పారుపల్లి అనితా దయాకర్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకుడు బేర బాలకిషన్ అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా సరూర్‌నగర్ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రజల మధ్య విద్వేషాలు పెంచి మతాల మధ్య చిచ్చు పెడుతున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలతో ప్రజల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గత పదేండ్లలో కేంద్రంలో మోదీ ప్రభుత్వం దేశాన్ని సర్వనాశనం చేసిందన్నారు. పేదలను దోచి పెద్దలకు పెట్టిన మోదీకి బుద్ధి చెప్పాలంటే బీజేపీ ఎంపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు.

హక్కులు సాధించే వరకు పారాటం

కాచిగూడ,ఏప్రిల్ 25: బీసీలకు రాజ్యాంగ హక్కులను కల్పించే వరకు పోరాటం ఆగదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. గురువారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించి, రిజర్వేషన్లను 25 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్రం బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, క్రీమిలేయర్‌ను రద్దు చేయాలని పేర్కొన్నారు. బీసీల సమస్యలపై త్వరలో జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఉద్యమాలను చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

ఓటు హక్కు వజ్రాయుధంలాంటిది..

ఓటరు స్లిప్పుల పంపిణీలో అలసత్వం వద్దు..

జవహర్‌నగర్, ఏప్రిల్ 25: సమాజంలో ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని, ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి సూచించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ తహసీల్దార్ మీటింగ్ హాల్‌లో కీసర ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఎల్ఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి, డీటీ భాస్కర్‌రెడ్డి, ఆర్ఐ శ్రీలక్ష్మి, బీఎల్‌వోలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మేడ్చల్ కలెక్టరేట్ : ఓటరు స్లిప్పులను సకాలంలో ఓటర్లకు అందజేయాలని కమిషనర్ రాజేందర్ కుమార్ బీఎల్‌వోలను ఆదేశించారు. గురువారం పురపాలక సంఘం నాగారం కార్యాలయంలో బీఎల్‌వోల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వార్డుల్లో ఓటర్లందరికీ స్లిప్పులు అందేలా చూడాలన్నారు. పంపిణీలో అలసత్వం ప్రదర్శించవద్దన్నారు.

టీఎంహెచ్ఈయూ కార్యాలయం ప్రారంభం

అంబర్‌పేట, ఏప్రిల్ 25: నల్లకుంటలోని ఫీవర్ ఆసుపత్రిలో గురువారం తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయాన్ని యూనియన్ ప్రధాన కార్యదర్శి అశోక్ ఆధ్వర్యంలో పునఃప్రారంభించారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.కె.శంకర్ ముఖ్య అతిథిగా హాజరై హాస్పిటల్ ఆర్ఎంఓ డా.జయలక్ష్మి, డాక్టర్ చంద్ర శేఖర్, ఏఓ మోహన్‌దాస్, టీఎంహెచ్ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు రాబర్ట్ బ్రూస్‌తో కలిసి కార్యాలయాన్ని ప్రారంభించారు.



టీఎంహెచ్ఈయూ కార్యాలయాన్ని రాష్ట్ర అధ్యక్షుడు రాబర్ట్ బ్రూస్‌తో కలిసి ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్, తదితరులు

ఈ కార్యక్రమంలో యూనియన్ ఫీవర్ హాస్పిటల్ బ్రాంచ్ అధ్యక్షురాలు లావణ్య, జనరల్ సెక్రటరీ రాజ్‌కుమార్,వైస్ ప్రెసిడెంట్ పద్మజ, జనార్దన్, జాయింట్ సెక్రటరీ సంతోష్, సత్యనారాయణ, ఏఐటీయూసీ యూనియన్ ప్రెసిడెంట్ ఖమ్రూద్దీన్, ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తులకు ఘనంగా వీడ్కోలు

కార్యక్రమంలో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా కోర్టులు,ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా కోర్టులో పనిచేసి బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తులను జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శి వై.కొండల్‌రెడ్డి, గులగారి కృష్ణ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో బదిలీలు తప్పవని, సమర్థవంతంగా సేవలందించే అధికారులు ఎప్పటికీ గుర్తుండిపోతారని అన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న అదనపు జిల్లా న్యాయమూర్తులు శ్రీమతి భవానీచంద్ర, టి.నర్సిరెడ్డి, ఎన్.పంచాక్షరి, సీనియర్ సివిల్ జడ్జ్ మాధవీలత,రంగారెడ్డి జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి డి.ఇందిరను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మెట్రోపాలిటన్ సెషన్స్